సాక్షి
నిర్మల్
ఆదివారం । 28 । జనవరి । 2024

నీ వెంటే నేను..

అగ్ని సాక్షిగా మూడు ముళ్లతో ఒక్క టైన ఆ బంధం ఎనిమిది నెలలకే చితికి పోయింది. క్షణికావేశం వారిని అనంత లోకాలకు చేర్చింది. ఆత్మ హత్య చేసుకున్న ఆ నవదంపతులను ఒకే చితిపై చేర్చడం అందరినీ కంటతడి పెట్టించింది.

- వివరాలు 8లో▸



గరిష్టం/కనిష్టం
30.1 / 17.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

పత్తి రైతుల హైరానా..!



జిల్లాలో పత్తి కొనుగోళ్లు ఇలా...

సీసీఐ కొనుగోలు కేంద్రాలు : 17
ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పత్తి : 3.20 లక్షల క్వింటాళ్లు
ప్రైవేట్‌లో విక్రయానికి వచ్చిన పత్తి : 1.69 లక్షల క్వింటాళ్లు

భైంసాలోని సీసీఐ కేంద్రం వద్ద బారులు తీరిన పత్తి వాహనాలు

- పూర్తి కావస్తున్న సీసీఐ కొనుగోళ్లు
- ధర తగ్గుతుందన్న ఆందోళనతో మిల్లులకు పరుగులు
- రాత్రి నుంచే కేంద్రాల వద్ద పడిగాపులు

భైంసా/భైంసాటౌన్‌: జిల్లాలో పత్తి విక్రయాలు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ప్రైవేట్‌ వ్యాపారులు మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు సీసీఐ కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు. ప్రారంభంలో ప్రైవేట్‌ వ్యాపారులు సీసీఐకి సమానంగా ధర చెల్లించినా, డిమాండ్‌ హెచ్చుతగ్గుల నేపథ్యంలో మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయిస్తున్నారు. దీంతో కేంద్రాల వద్ద పత్తి వాహనాలు బారులు తీరి కనిపిస్తున్నాయి. దీనికితోడు కొద్దిరోజుల్లో సీసీఐ కొనుగోళ్లు పూర్తి కావచ్చన్న ఊహాగానాల నేపథ్యంలో రైతులు వీలైనంత త్వరగా విక్రయించేందుకు సీసీఐ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు.

తగ్గిన దిగుబడి..

జిల్లావ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో పత్తిపంట సాగైంది. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. భారీ వర్షాలతో పత్తిపంట ఎదుగలేదు. తెగుళ్ల పంటను దెబ్బతీశాయి. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. మరోవైపు పత్తి తీసేందుకు సకాలంలో కూలీలు దొరకక రైతులు ఇబ్బందిపడుతున్నారు.



విక్రయానికి తెచ్చిన పత్తి అన్‌లోడ్‌ చేస్తున్న రైతు

ధర తగ్గింపు..

ఇదిలా ఉండగా ప్రస్తుతం సీసీఐ కూడా ధర తగ్గించింది. కేంద్రం పత్తికి మద్దతు ధరను రూ.7020గా నిర్ణయించింది. సీసీఐ కూడా మొదట్లో ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించింది. ప్రస్తుతం రైతులు మార్కెట్‌కు తెస్తున్న పత్తి నాణ్యత తగ్గింది. మొదట వచ్చినట్లుగా ఉండడం లేదు. క్వాలిటీ తగ్గడం, అంతర్జాతీయంగా పత్తి ధరలు పడిపోవడంతో సీసీఐ కూడా ధరను రూ.50 తగ్గించింది. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.6,970 మాత్రమే చెల్లిస్తోంది. రానున్న రోజుల్లో పత్తి ధర మరింత తగ్గవచ్చన్న ప్రచారం నేపథ్యంలో రైతులు పత్తి విక్రయాలకు పరుగులు పెడుతున్నారు.

రాత్రి నుంచే మిల్లుల వద్ద..

సీసీఐ కేంద్రాల్లో రోజుకు సరాసరిన 8 వేల నుంచి పది వేల క్వింటాళ్ల వరకు పత్తి విక్రయానికి వస్తోంది. దీంతో ఆయా మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోతున్నాయి. పత్తి నుంచి వచ్చే గింజలకు సైతం ధర తగ్గడంతో మిల్లుల్లో పత్తి గింజల నిల్వలు పేరుకుంటున్నాయి. బేళ్లకు అంటించే సీసీఐ లేబుళ్లు సైతం సకాలంలో అందక బేళ్లు గోదాములకు తరలించడం లేదు. స్థలాభావం కారణంగా పత్తి కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. మరోవైపు ధర తగ్గడం, పత్తి కొనుగోళ్లు త్వరలో పూర్తవుతాయన్న ప్రచారం నేపథ్యంలో ఇళ్లలో నిల్వఉన్న పత్తిని విక్రయానికి తీసుకెళ్తున్నారు. రాత్రి నుంచే సీసీఐ కేంద్రాల వద్ద వాహనాలతో క్యూ కడుతున్నారు. కొనుగోళ్లు పూర్తయ్యేవరకు సీసీఐ కొనుగోళ్లు జరపాలని కోరుతున్నారు.

నాలుగు చోట్ల పత్తి కొనుగోళ్లు..

ఈయేడు ప్రైవేటులో ధర లేకపోవడంతో సీసీఐకే రైతులు పత్తిని విక్రయిస్తున్నారు. జిల్లాలో భైంసా, నిర్మల్, సారంగాపూర్, కుభీర్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్లు జరుపుతోంది. 18,049 మంది రైతులు సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించారు. ఈనెల 22 వరకు పత్తి విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇప్పటి వరకు 3.20 క్వింటాళ్ల కొనుగోలు..

సీసీఐ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 3,20,315 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. భైంసాలో 1,88,422 క్వింటాళ్లు, నిర్మల్‌లో 72,680 క్వింటాళ్లు, సారంగాపూర్‌లో 35,197 క్వింటాళ్లు, కుభీర్‌లో 24,016 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఇక ఈ ఏడాది ప్రైవేటు కొనుగోళ్లు నామమాత్రంగానే సాగుతున్నాయి. గతేడాది ప్రైవేటు వ్యాపారులు ఈ సమయానికి 1,82,840 క్వింటాళ్ల పత్తిని కొనుగోలుచేశారు. సీసీఐకి విక్రయానికి వచ్చిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోవడమో, ఓటీపీ రాకపోవడం లాంటి సమస్యలు ఉన్న రైతులే ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

రెండురోజుల్లో ముగుస్తుందన్నరు..



ప్రైవేట్‌లో మద్దతు ధర లేక సీసీఐలోనే పత్తి విక్రయిస్తున్న. రెండు రోజుల్లో సీసీఐ కేంద్రాలు బంద్‌ చేస్తరని ప్రచారం జరుగుతుంది. నిల్వ ఉంచిన పత్తిని విక్రయించేందుకు తెచ్చిన. కేంద్రాల వద్ద రద్దీ ఉందని రాత్రి 2 గంటలకే వచ్చిన. సీసీఐ అధికారులు రైతుల నుంచి పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేయాలి.

– సయ్యద్‌ అజర్, రైతు, కుభీర్

పూర్తిస్థాయిలో కొనుగోలు...

జిల్లాలోని 17 జిన్నింగ్‌ మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. రోజుకు సరాసరి పది వేల క్వింటాళ్ల వరకు సీసీఐ కేంద్రాలకు పత్తి వస్తోంది. ఇంకా రైతుల నుంచి పత్తి విక్రయానికి వస్తే కేంద్రాలు కొనసాగిస్తాం. పత్తి రాక తగ్గితే రైతులకు సమాచారమిచ్చి కొనుగోళ్లు నిలిపేస్తాం.

– అష్ఫక్‌ అహ్మద్, మార్కెటింగ్‌ ఏడీ, నిర్మల్

న్యూస్‌రీల్‌

గ్రంథాలయాల బడ్జెట్‌ ఆమోదం



అంచనాలను వివరిస్తున్న లక్ష్మీరాజ్యం

నిర్మల్‌టౌన్‌: జిల్లాలో గ్రంథాలయాలను సందర్శించే పాఠకుల సౌకర్యార్థం బడ్జెట్‌ అంచనాలు తయారు చేసినట్లు అదనపు కలెక్టర్‌ ఫైజాన్‌అహ్మద్, జిల్లా గ్రంథాలయాల ఇన్‌చార్జి సెక్రెటరీ లక్ష్మీరాజ్యం వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఫైజాన్‌ అహ్మద్‌ అధ్యక్షతన జిల్లా గ్రంథాలయాల బడ్జెట్‌ అంచనాలపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయాల బడ్జెట్‌ అంచనాలను గ్రంథాలయాల సెక్రెటరీ చదివి వినిపించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన వ్యయాలతో కూడిన బడ్జెట్‌ పరిశీలన, ఆమోదం నిమిత్తం కమిటీ సమావేశమై కంప్యూటర్, లైబ్రరీ బుక్స్, గ్రంథాలయాల నిర్వహణ, సెమినార్లు అంచనాలతో కూడిన రూ.1,28,45,700 బడ్జెట్‌కు కమిటీ ఆమోదం తెలిపింది. డీఎల్పీవో రమేశ్, డీపీఆర్వో తిరుమల, విద్యాశాఖ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన డీసీసీ అధ్యక్షుడు




మహేశ్‌కుమార్‌గౌడ్‌తో శ్రీహరిరావు

నిర్మల్‌టౌన్‌: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు శనివారం హైదరాబాద్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించి రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిగా చూడాలని ఆకాంక్షించారు.

'ఆ హక్కు కేటీఆర్‌కు లేదు'

భైంసా: తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్‌ కోదండరామ్‌ కీలకంగా వ్యవహరించి అన్ని రాజకీయ పార్టీలతో ఏర్పడిన తెలంగాణ జాయింట్‌ యాక్షన్‌ కమిటీకి చైర్మన్‌గా ఎన్నో పోరాటాలు నిర్వహించి సబ్బండవర్గాలను ఏకం చేశారని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్‌ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ ముష్కం రామకృష్ణాగౌడ్‌ అన్నారు. భైంసాలో శనివారం మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గతంలో ప్రొఫెసర్‌ కోదండరామ్‌ ఇంటిపై కేసీఆర్‌ సర్కార్‌ పోలీసులు చేయించిన దౌర్జన్యాన్ని ఎవరూ మర్చిపోలేదన్నారు. ప్రతిపక్షం లేకుండా చేసిన గత ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు ఇంటిబాట పట్టించారన్నారు. గవర్నర్‌ కోటాలో ప్రొఫెసర్‌ కోదండరామ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం రావడం జీర్ణించుకోలేనివారే దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కోదండరామ్‌కు పదవి దక్కడాన్ని తెలంగాణ ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేటీఆర్‌ ఇలాంటి విషయాల్లో హుందాగా వ్యవహరించాలని సూచించారు.

దుకాణాలు తొలగించిన ఆర్టీసీ అధికారులు



దుకాణాలు తొలగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

భైంసా: బాసర బస్టాండ్‌లో ఉన్న దుకాణాలను ఆర్టీసీ అధికారులు తొలగిస్తున్నారు. కొన్ని రోజులుగా దుకాణాల తొలగింపు కార్యక్రమం జరుగుతోంది. శనివారం బస్టాండుకు ఒకవైపు ఉన్న దుకాణాలను తొలగించారని వ్యాపారులు ప్రశ్నించారు. దీంతో భైంసా ఆర్టీసీ డీఎం అమృత బాసర రెవెన్యూ, పోలీసు అధికారులు బాసర బస్టాండుకు చేరుకున్నారు. కొద్దిసేపు అధికారులు, వ్యాపారుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఆర్టీసీ స్థలంలో ఉన్న ప్రైవేటు దుకాణాలను తొలగించారు.

2న ఇంద్రవెల్లికి సీఎం

- ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్‌: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లికి రానున్నట్లు ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. అమరవీరుల స్మృతి వనానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఖానాపూర్, పెంబి మండలాల ముఖ్య నాయకులతో పట్టణంలో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పూరి గుడిసెలో పుట్టి.. చెలిమె నీళ్లు తాగి పెరిగానని, ఆదివాసీల కష్టాలు తనకు తెలుసన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. ఆరు గ్యారంటీలతోపాటు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా శ్రేణులు పని చేయాలని సూచించారు.

ఖానాపూర్‌ అభివృద్ధికి కృషి..

నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌ పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని వెడ్మబొజ్జు హామీ ఇచ్చారు. నిలిచిపోయిన రోడ్డు వైండింగ్‌ పనులు తిరిగి ప్రారంభించాలన్నారు. ఎవరైనా పనులను అడ్డుకుంటే వారి ఇంటి ముందు ధర్నా చేయాలని సూచించారు.

ఓటింగ్‌ శాతం పెంచాలి..

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్‌ శాతం పెరిగేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గంలో ఖానాపూర్‌లోనే ఎక్కువ ఓటింగ్‌ నమోదయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఎన్నికల సరళిపై పార్టీ శ్రేణులతో గ్రామాలు, బూత్‌ల వారీగా సమీక్ష చేశారు. సమావేశంలో నాయకులు దయానంద్, స్వప్నిల్‌రెడ్డి, చిన్నం సత్యం, యూసుఫ్‌ఖాన్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, రాజునాయక్, జంగిలి శంకర్, శంకర్‌గౌడ్, మజీద్, షౌకత్‌పాషా, సలీంఖాన్, అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇక నాలుగు రోజులే..!



క్షేత్రస్థాయిలో కార్డుదారుల వివరాలను సేకరిస్తున్న రేషన్‌ డీలర్లు

- ముగియనున్న ఈకేవైసీ నమోదు గడువు
- ఈ నెల 31వరకు అవకాశం
- ఉమ్మడి జిల్లాలో ఇంకా 6.56 లక్షల మంది అప్‌డేట్‌ చేసుకోలే..

కైలాస్‌నగర్‌: బోగస్‌ రేషన్‌ కార్డుల ఏరివేతతో పాటు మరణించిన, శాశ్వతంగా వలసవెళ్లిన వారి పేర్లు తొలగించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రేషన్‌ ఈకేవైసీ నమోదుకు శ్రీకారం చుట్టింది. గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించగా, ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. మరో నాలుగు రోజులే మిగిలి ఉండగా, ఇంకా లక్షలాది మంది అప్‌డేట్‌ చేసుకోలేదు. మరోవైపు గడువు పెంపుపై ప్రభుత్వం నుంచి ఇప్పటిదాకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. అప్‌డేషన్‌ చేసుకోకుంటే బియ్యం పంపిణీకి బ్రేక్‌ పడనుందనే ప్రచారంతో తమ పరిస్థితేంటని మిగిలిన కార్డుదారులు ఆందోళనకు గురవుతున్నారు.

ఈకేవైసీకి దూరంగా 6.56లక్షల మంది

ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా పరిధిలో 7,59,228 రేషన్‌కార్డులుండగా అందులో మొత్తం 23,81,218 మంది సభ్యులున్నారు. ఇప్పటి వరకు 17,24,511 మంది కార్డుదారులు ఈకేవైసీ వివరాలను ఆయా జిల్లాల్లోని రేషన్‌ డీలర్ల ద్వారా నమోదు చేసుకున్నారు. ఇంకా 6,56,706 మంది నమోదు చేసుకోవాల్సి ఉంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే.. ఆదిలాబాద్‌లో 1,64,048 మంది, కుమురంభీంలో 1,43,432 మంది, నిర్మల్‌లో '1,52,557 మంది, మంచిర్యాలలో అత్యధికంగా 1,96,669 మంది ఇంకా అప్‌డేషన్‌ చేసుకోలేదు. ఇలాంటి వారిలో ఎక్కువగా వృద్ధులు, చిన్నపిల్లలే ఉన్నారు. ఆధార్‌ అప్‌డేషన్‌ చేసుకోలేని వారు కూడా కొంతమంది ఉన్నారు. ప్రభుత్వం గడువు పొడిగించకుంటే వీరంతా నష్టపోయే అవకాశం లేకపోలేదు.

ఆధార్‌ అప్‌డేషన్‌ లేకనే..

ఈకేవైసీ పూర్తిస్థాయిలో కాకపోవడానికి కార్డుదారుల ఆధార్‌ అప్‌డేట్‌ లేకపోవడమే ప్రధాన సమస్యగా తెలుస్తోంది. వృద్ధులు, చిన్నారుల ఐరిస్‌ వివరాలు రాకపోవడం కారణంగా చెబుతున్నారు. ఇలాంటి వారు రేషన్‌షాపులకు వెళ్లగా ఆధార్‌ సెంటర్లకు వెళ్లి తమ వివరాలు అప్‌డేట్‌ చేసుకోవాలని సూచించడంతో చాలా మంది ఆ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. అయితే వారికి సరిపడా టోకెన్లు దొరకపోవడంతో వివరాలు ఇంకా అప్‌డేట్‌ చేసుకోలేదు. మిగిలిపోయిన వృద్ధులు, చిన్నారుల ఈకేవైసీ నమోదు కోసం రేషన్‌ డీలర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివరాలు సేకరిస్తున్నా ప్రక్రియ మాత్రం 80శాతం చేరకపోవడం గమనార్హం. ప్రభుత్వం గడువు పొడిగించకుంటే కార్డుదారులు నష్టపోయే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

జిల్లా	మొత్తం రేషన్‌ కార్డులు	సభ్యులు	ఈకేవైసీ పూర్తి	శాతం
ఆదిలాబాద్	1,91,770	6,39,246	4,75,198	74.34
ఆసిఫాబాద్	1,39,782	4,60,458	3,17,026	68.95
మంచిర్యాల	2,19,190	6,39,546	4,42,877	69.25
నిర్మల్	2,08,486	6,41,968	4,89,411	76.24

ప్రభుత్వానికి నివేదిస్తాం



తమ పరిధిలోని ప్రతీ కార్డుదారుడి ఈకేవైసీ నమోదు చేసేలా చూడాలని డీలర్లను ఆదేశించాం. వారు క్షేత్రస్థాయికి వెళ్లి కూడా నమోదు చేస్తున్నారు. అయితే ఆధార్‌ అప్‌డేట్‌ లేని వారు మిగిలిపోయే అవకాశముంది. వీరితో పాటు ఐరిస్, ఆధార్‌ వివరాలు లేని వృద్ధులు, చిన్నారుల వివరాలు ప్రత్యేకంగా సేకరించాలని సూచించాం. వాటిని ప్రత్యేకంగా నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి కార్డుదారుడు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాల్సిందే.

– కిరణ్‌కుమార్, డీఎస్‌వో, ఆదిలాబాద్

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- నిర్మల్‌ ఆర్టీవో అజయ్‌కుమార్‌రెడ్డి



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఆర్టీవో, ట్రాఫిక్‌ ఎస్సై..

నిర్మల్‌టౌన్‌: రహదారి భద్రత నియమాలను వాహనదారులు పాటించాలని నిర్మల్‌ ఆర్టీవో అజయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. 37వ జాతీయ రోడ్డుభద్రత వారోత్సవాలను ట్రాన్స్‌పోర్ట్, పట్టణ ట్రాఫిక్‌ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్‌ స్టేడియం నుంచి మంచిర్యాల చౌరస్తా వరకు 200 మంది విద్యార్థులు, 100 ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు వారోత్సవాల పోస్టర్‌ను పట్టణ ట్రాఫిక్‌ ఎస్సై రాజశేఖర్‌తో కలిసి, ఆర్టీవో ఆవిష్కరించారు. అనంతరం అజయ్‌కుమార్‌రెడ్డి, ట్రాఫిక్‌ ఎస్సై రాజశేఖర్‌ మాట్లాడుతూ.. రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. దేశంలో నిమిషానికో రోడ్డు ప్రమాదం జరుగుతుందన్నారు. మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో చనిపోతున్నారని తెలిపారు. ఎక్కువ శాతం అధిక వేగంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. రోడ్డుపై వాహనాలు నడిపే అందరూ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ ధరించాలని, డ్రంకెన్‌డ్రైవ్‌ చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఎస్‌ఐ రాజశేఖర్, ఎంవీఐ హరీంద్ర, ట్రాన్స్పోర్ట్,

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

నిర్మల్‌ ఖిల్లా: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. నిర్మల్‌ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన 'గావ్‌ చలో అభియాన్‌(పల్లెకు పోదాం)' కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ చేపడుతున్న ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువయ్యేలా ప్రతీ కార్యకర్త చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.అంజుకుమార్‌రెడ్డి, గావ్‌ చలో అభియాన్‌ కార్యక్రమ జిల్లా కన్వీనర్‌ సామ రాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటు కన్వీనర్‌ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లికార్జునరెడ్డి, నారాయణరెడ్డి, జిల్లా పదాధికారులు, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

మేమున్నామని..

- అనాథలకు అండగా..
- ఆపదలో ఉన్నవారికి రక్తదానం..
- ఆకలితో ఉన్నవారికి అన్నదానం..
- ఆదర్శంగా.. ఐక్యత సేవా సమితి



రక్తదానం చేస్తున్న ఐక్యత సేవా సమితి సభ్యుడితో బృందం సభ్యులు

భైంసారూరల్‌: చీకటితో వెలుగే చెప్పెను నేనున్నానని.. ఓటమితో గెలుపే చెప్పెను నేనున్నానని.. అంటూ ఓ సినీ కవి పాట శారాడు. ఎంతో స్ఫూర్తినిచ్చే పాటను నిజం చేస్తున్నారు. ఐక్యత సేవా సమితి సభ్యులు. అనాథలకు అండగా, ఆపదలో ఉన్నవారికి రక్త దాతలుగా, ఆకలితో ఉన్నవారికి అన్నదాతలుగా సేవలు అందిస్తూ ఆపదలో మేమున్నామన్న భరోసా ఇస్తున్నారు. సమితిలో ఉన్న వంద మంది సభ్యులు తమకు తోచిన విధంగా సహాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలోనే కాకుండా పొరుగున ఉన్న నిజామాబాద్‌ జిల్లాకు కూడా వెళ్లి అత్యవసర పరిస్థితిలో రక్తం అవసరమైనవారికి తమ రక్తం అందించి ప్రాణదానం చేస్తున్నారు.

పది మందితో ప్రారంభమై...

భైంసా పట్టణంలో పది మంది యువకులతో ఐక్యత సేవా సమితి ప్రారంభమైంది. ఐదేళ్ల క్రితం ఏర్పడిన ఈ బృందం క్రమంగా సేవలను విస్తరిస్తోంది. బృందం సేవలు నచ్చినవారు మేము సైతం అంటూ సభ్యులుగా చేరుతున్నారు. దీంతో సభ్యుల సంఖ్య ప్రస్తుతం వందకు చేరింది. మొదట భైంసా పట్టణంతోపాటు చుట్టు పక్కల రోడ్డు ప్రమాదాల్లో గాయపడి రక్తం అవసరం ఉన్నవారికి సభ్యులు రక్తదానం చేసేవారు. తర్వాత అనాథలను చేరదీయడం ప్రారంభించారు. ఎవరూ లేనివారికి రోజూ భోజనం అందిస్తూ ఆకలి తీరుస్తున్నారు. అనాథలను చేరదీసి భైంసాలోని వివేకానంద ఆవాసంలో చేర్పించారు.



ఆహారం పంపిణీ చేస్తున్న సేవా సభ్యులు

మిగిలిన అన్నం సేకరించి..

భైంసా పట్టణంలో శుభకార్యంలో మిగిలిన ఆహారాన్ని ఐక్యత సేవా సమితి సేకరిస్తుంది. దానిని తీసుకువచ్చి ఆకలితో అలమటించే వారికి అందిస్తోంది. ఆహారాన్ని వృథా చేయకుండా నలుగురి కడుపు నింపుతున్నారు. రోడ్లపై ఎక్కడైనా మూగజీవాలు మృత్యువాత పడితే సమితి సభ్యులు సమాచారం అందుకుని వాటిని ఖననం చేస్తున్నారు. గోవులను పూజించాలని, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు సేవచేయాలని సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని బృందం సభ్యులు యువకులకు నిత్యం సూచిస్తారు. స్వయం ఉపాధితో కుటుంబాలను పోషిస్తూ మరోవైపు ఆపదలో, ఆకలితో ఉన్నవారికి తమ వంతు సాయం అందిస్తున్న ఐక్యత సేవా సమితి అందరి మన్ననలు పొందుతోంది.

మరిన్ని సేవలు



మిత్రులంతా కలిసి ఐదేళ్లక్రితం ఐక్యత సేవా సమితి ఏర్పాటు చేశాం. ఆపద సమయంలో రక్తం అవసరం ఉన్నవారికి రక్తదానం చేయడం, చికిత్స పొందుతున్న బాధితులకు భోజనాలు తీసుకెళ్తున్నాం. భైంసా, నిర్మల్, నిజామాబాద్‌ ఆస్పత్రుల్లో చికిత్స పొందే వారికి సాయం అందిస్తున్నాం. ఏ విషయం తెలిసినా నిమిషాల్లో స్పందిస్తున్నాం. మా వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నాం.

– యోగేశ్, ఐక్యత సేవా సమితి సభ్యుడు

ఆపద వస్తే ఆదుకుంటాం



ఆపద వస్తే ఆదుకోవడమే మాకు తెలుసు. మా సంఘంలో ఏ సమాచారం వచ్చినా అందరికీ చేరవేస్తున్నాం. రక్తం అవసరం ఉన్న గ్రూపుల్‌లో ఈ విషయం తెలుసుకుని అక్కడికి వెళ్తున్నాం. మా గ్రూపులో రక్తదానం చేసే యువకుల జాబితాను సిద్ధంగా ఉంది. రక్తం కావాలని కోరిన వెంటనే దాతలకు సమాచారం అందించేలా చూస్తాం.

– భీమ్‌శంకర్, సేవా సమితి సభ్యుడు

క్లుప్తంగా

జాతరలో దేశీదారు పట్టివేత


దేశీదారు చూపుతున్న పోలీసులు

తానూరు: మొగ్లిలో శనివారం నిర్వహించిన జాతరలో దేశీదారు విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మహారాష్ట్రలోని ముత్‌ఖేడ్ గ్రామానికి చెందిన జాదవ్ ఆకాశ్ మహారాష్ట్ర నుంచి అక్రమంగా తీసుకొచ్చిన దేశీదారును జాతరలో విక్రయిస్తున్నాడని తెలిపారు. అతడి నుంచి 17 బాటిళ్లను స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దేశీదారును ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో కులదేవత ఉత్సవాలు


జంగుబాయి పల్లకితో వెళ్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఆదివాసీ గ్రామాల్లో కుల దేవత ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పెర్సపేన్(పెద్ద దేవుడు)జంగుబాయి దేవత, భీమల్‌దేవ్ పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని రాజుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీలు జంగుబాయి దేవతతో ఉట్నూర్ మండలంలోని కారి ఏర్ మడుగుకు వెళ్లి పుణ్యస్నానం ఆచరించారు. రాత్రి జంగుబాయి దేవతకు మహాపూజ నిర్వహించనున్నట్లు కటోడ తోడసం బండు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆర్‌ఎంపీ మృతి

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు మంతెన సత్యం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 22న ధర్మాజీపేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యం కాలు విరగడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ముగిసిన దివాకర్ అంత్యక్రియలు


మృతదేహానికి నివాళులర్పిస్తున్న జోగు రామన్న

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ హఠాన్మరణం పొందిన దివాకర్ అంత్యక్రియలు శనివారం స్థానిక పిట్టలవాడ శ్మశాన వాటికలో ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మున్సిపల్ కమిషనర్ శైలజ, మున్సిపల్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరై తుది వీడ్కోలు పలికారు. అంతకు ముందు అంబికానగర్‌లో మృతదేహానికి జోగు రామన్న పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

నీ వెంటే నేను...

గుడిహత్నూర్/కైలాస్‌నగర్: వారి వయసు 25 ఏళ్లలోపే... ఇరువురి రాష్ట్రాలు వేరైనా అగ్నిసాక్షిగా మూడుముళ్లతో ఒక్కటైన ఆ బంధం ఎనిమిది నెలలకే చితికిపోయింది. కొంతకాలం అన్యోన్యంగా సాగిన వారి కాపురం.. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ ఆ నవ దంపతులు తమ జీవితాలకు ముగింపు పలికారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం మిగిల్చారు. పెళ్లిలో ఏడడుగులు నడిచి జీవితాంతం కలిసే ఉంటామని ఆశపడ్డ ఆ జంట చావులోనూ ఒక్కటై జీవితానికి ముగింపు పలికారు. గంట వ్యవధిలోనే నవ దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనతో గుడిహత్నూర్ మండలం కొల్హారీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- క్షణికావేశంలో భార్య.. తట్టుకోలేక భర్త
- 8 నెలలకే తనువు చాలించిన దంపతులు
- ఒకే చితిపై ఇద్దరి దహన సంస్కారాలు
- కొల్హారీ గ్రామంలో విషాదఛాయలు


విజయ్ మృతదేహం


పల్లవి మృతదేహం

అత్తారింటికి వచ్చి ఆత్మహత్య...

గుడిహత్నూర్ మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన శేవాళే విజయ్ (24)కు మహారాష్ట్రలోని బుల్దా గ్రామానికి చెందిన పల్లవి (20)తో గతేడాది మే 22న వివాహం జరిగింది. విజయ్ తనకున్న 14 ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. విజయ్ నాన్న ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. అమ్మ పుష్పాబాయి, ఐదుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. వీరందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. అందరూ ఎంతో సంతోషంగా ఉంటున్నారు. ఈ క్రమంలో సంక్రాంతికి పుట్టింటికి వెళ్లిన పల్లవి శుక్రవారం తన సోదరుడు కృష్ణతో కలిసి కొల్హారీకి చేరుకుంది. వీరి రాక విషయం తెలుసుకున్న విజయ్ బావమరిదితో కలిసి భోజనం చేసి ఆయనను గుడిహత్నూర్ వరకు సాగనంపాడు. అనంతరం చేనుకు వెళ్లి పనిలో నిమగ్నమయ్యాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న పల్లవి తన గదిలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు విజయ్‌కు సమాచారమందించి ఆటోలో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

గంట వ్యవధిలోనే భర్త...

పుట్టింటికి వెళ్లి వచ్చిన భార్య పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడడంతో విజయ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. భార్య మరణం తట్టుకోలేక అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి స్మశాన వాటికకు వెళ్లి ఫోన్ స్విచ్ఆఫ్ చేసుకున్నాడు. తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఫోన్ ఆన్ చేశాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయడంతో వారితో విషయం చెప్పాడు. కుటుంబ సభ్యులు అపస్మారస్థితిలో పడి ఉన్న విజయ్‌ను రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

ఒకే చితిపై ఇద్దరు..

విషయం తెలుసుకున్న కొల్హారీ గ్రామస్తులు శుక్రవారం రాత్రి నుంచీ రిమ్స్‌లో పడిగాపులు కాస్తూ తోచిన సహాయం చేశారు. పల్లవి మృతికి కారణాలు తెలియకపోగా విజయ్ తన భార్య లేకుండా నేనెలా ఉండగలను. సమాజానికి నేనేం చెప్పాలి? అని మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. ఇరువురి మృతదేహాలకు పోలీసులు రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. శనివారం సాయంత్రం కొల్హారీలోని విజయ్ చేనులో ఒకే చితిపై ఇద్దరి అంత్యక్రియలు నిర్వహించారు.

మూడు తరాలుగా...

విజయ్ కుటుంబంలో మూడు తరాలుగా ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. విజయ్ తండ్రి ప్రకాష్, తాత సైతం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఏ దేవుడి శాపమో మా వారసులకు పురుగుల మందు యమపాశమై పడుతోందని విజయ్ అక్కా చెల్లెళ్లు రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

తెలంగాణకు ద్రోహం చేసిందే కాంగ్రెస్

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

ఇచ్చోడ(బోథ్): తెలంగాణకు ద్రోహం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కూడా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు అడ్డుపడ్డ విషయం తెలంగాణలో ఉన్న ప్రతీ ఉద్యమకారునికి తెలుసని ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పరిశీలకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. శనివారం బోథ్‌లో ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఆపార్టీపై ప్రేమతో ఓట్లు వేయలేదన్నారు. తెలంగాణలో ప్రజాప్రయోజనాలు కాపాడటానికే బీఆర్ఎస్‌కు ప్రజలు ప్రతిపక్ష హోదా ఇచ్చారన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇక్కడి ప్రాంత సమస్యలు పరిష్కరించకుండా తమ స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ మాజీ ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ కొంతమంది నాయకులు తమ స్వార్థ ప్రయోజనాలకోసం జాతికి ద్రోహం చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, బోథ్, ఇచ్చోడ, నేరడిగొండ ఎంపీపీలు తుల శ్రీనివాస్, నిమ్మల ప్రీతంరెడ్డి, సజన్‌లాల్, తాంసి, భీంపూర్, బోథ్ జెడ్పీటీసీలు రాజు, సుధాకర్, సంధ్యారాణి, తొమ్మిది మండలాల పార్టీ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి


కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఆదిలాబాద్‌రూరల్: మంచిర్యాల జిల్లా దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపనీ కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డెప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు భీంరావ్, సతీష్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఐదేళ్లుగా నిర్వహించడం లేదన్నారు. గతంలో కోర్టును సైతం ఆశ్రయించగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ అమలులోకి రాక ముందు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్మికులు రాజయ్య, శ్రీనివాస్, శంకర్, సత్యనారాయణ, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చడంతో పాటు విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు త్వరలో మెగా డీఎస్సీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం మండలంలోని బీర్నందిలో అదనపు గదులతో పాటు డైనింగ్ హాల్ ప్రారంభోత్సవంలో మాట్లాడారు. మెగా డీఎస్సీ ఆలస్యమైతే అవసరమైతే విద్యావలంటీర్లను నియమించి విద్యాబోధన చేయించేలా దృష్టి సారిస్తామన్నారు. విద్యార్థి నాయకుడిగా విద్యారంగంలోని సమస్యలపై అవగాహన ఉందన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం

రైతుల పోడు భూములతో పాటు గ్రామాల్లో రోడ్లకు అనుమతులు, ఇతర అవసరాల కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులు ఇసుక అక్రమ దందాలను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పత్రికల్లో వస్తే తప్ప అధికారులు స్పందించని పరిస్థితి ఉందన్నారు. తాను హెచ్చరించినా అధికారులు లైట్‌గా తీసుకోవడం సరికాదన్నారు. అనంతరం రూ.5 కోట్ల 20 లక్షలతో చేపట్టనున్న ఖానాపూర్-తర్లపాడ్ రెంకోని వాగు వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం, తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. సుర్జాపూర్ టూ సదర్మాట్ బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, సాగి సువర్ణ, లక్ష్మణ్‌రావు, మోహిద్, వాలిసింగ్, దయానంద్, నిమ్మల రమేశ్, అంకం రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మొగ్లిలో భక్తుల సందడి

- ముగిసిన మహాలక్ష్మి జాతర ఉత్సవాలు
- కిటకిటలాడిన ఆలయం
- కుస్తీ పోటీలకు భారీ స్పందన


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు


జాతరలో వస్తువులు కొనుగోలు చేస్తున్న భక్తులు

తానూరు(ముధోల్): మండలంలోని మొగ్లిలో మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజులుగా వైభవంగా కొనసాగుతున్న జాతర శనివారం ముగిసింది. జాతరకు తానూరు మండలంతో పాటు మహారాష్ట్రలోని దర్మాబాద్, భోకర్, ఉమ్రి, భైంసా, కుభీర్, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన చిన్నపిల్లల ఆట వస్తువులు, రంగులరాట్నాలు, గుర్రపు బగ్గీలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతరకు వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వెలసిన దుకాణాల్లో కొనుగోలు చేస్తూ సందడి చేశారు. చిన్నారులు రంగులరాట్నంలో కూర్చొని ఉల్లాసంగా గడిపారు.

జాతరలో భక్తుల సందడి

జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా గ్రామ కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం రాత్రి అమ్మవారి పల్లకి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని తాడుతో రథం లాగుతూ గ్రామంలోని ఆయా విధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి ఆలయానికి తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. ఎస్సై సందిప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

జాతర సందర్భంగా గ్రామ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు అంతర్రాష్ట్ర మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. ప్రథమ బహుమతి రూ.7,051 లతో పాటు వెండి కడియం, ద్వితీయ బహుమతి రూ.5051లతో పాటు వెండి కడియం అందించి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

ఆలయాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. మొగ్లిలో మహాలక్ష్మి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతరలో ఆయన పాల్గొన్నారు. ముందుగా మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

గిరిజనులకు పథకాలు అందేలా చూడాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా


మాట్లాడుతున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు వందశాతం గిరిజనులకు అందేలా చూడాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శనివారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సంబంధితశాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం, మహిళా, శిశు సంక్షేమం, స్వయం ఉపాధి పథకాల మంజూరు వంటి అంశాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్మన్) పథకం ద్వారా పీవీటీజీల కుటుంబాలకు తాగునీరు, విద్యుత్, రోడ్లు, నివాస గృహాలు, ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాలు, జీవనోపాధి కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలు, జీసీసీ మేనేజర్ రామానందం, ఏవో రాంబాబు, డీఈ శివకుమార్, ఏటీడీవో నిహారిక, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి నర్సరీలోని పూలతోటల వేలం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని బెల్లంపల్లి ఉద్యాన నర్సరీ(రోజ్ గార్డెన్)లో సాగు చేస్తున్న చామంతి, బంతి పూల తోటలను వేలం వేయనున్నట్లు ఐటీడీఏ ఇంచార్జి పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2న ఉదయం 11గంటలకు బెల్లంపల్లిలోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీ(రోజ్ గార్డెన్)లో వేలం పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఒక ఎకరంలో సాగు చేసిన చామంతి, బంతిపూల తోటలను ఒక సీజన్(మూడు నెలలకు)కు వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు, పూలకొట్టు దుకాణదారులు, రైతులు పాల్గొనాలని సూచించారు. వివరాలకు ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి కార్యాలయంలో లేదా ఉద్యాన అధికారి హెచ్‌వోను 9032313933 నంబరులో సంప్రదించాలని కోరారు.

కళను బాహ్యప్రపంచానికి తెలియజేయాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: తమలో ఉన్న కళను డబ్బుతో ముడిపెట్టకుండా బాహ్య ప్రపంచానికి తెలియజేయాలని, ఆపదలో ఎప్పుడూ వెన్నంటి మీ తోడు ఉంటానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన డాన్స్ కా దంగల్ సీజన్-2 అనే టీవీ రియాలిటీ షోలో ఉట్నూర్‌కు చెందిన కొండపర్తి హర్షిత, రాజారపు ఆరాధ్య భరతనాట్యంలో ఫ్లేమ్ రౌండ్‌లో విన్నర్‌గా నిలిచారు. రాష్ట్రం నుండి డ్యూయెట్ జోన్‌లో ఈ ఇద్దరు చిన్నారులు మాత్రమే ఎంపిక కావడం హర్షణీయమన్నారు. డ్యాన్స్ షోకు వెళ్లే సమయంలో ఇబ్బంది పడ్డ ఆ చిన్నారులకు ఎమ్మెల్యే రూ.30 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ సామంత్, భీమేశ్ గడ్డం, దుర్గన ఖానం, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


గేడం నరేశ్ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బీర్సాయిపేట గ్రామ పంచాయతీ పరిధి కొత్తగూడలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌కు చెందిన గేడం నరేశ్(45) ప్రైవేటు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం విధులకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం ఉదయం కొత్తగూడలోని ఓ బాత్‌రూంలో ఉరేసుకుని శవమై కనిపించాడు. స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య గేడం శశిరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

ఆలయాన్ని శుద్ధి చేసిన ఎంపీ


శుద్ధి చేస్తున్న ఎంపీ సోయం బాపూరావు

బోథ్: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతీ గ్రామంలో ఉన్న ఆలయాలను శుద్ధి చేసుకోవాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. శనివారం సోనాలలోని రామాలయాన్ని నీటితో శుద్ధి చేశారు అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుభాష్ సూర్య, రైల్వే బోర్డు సభ్యులు రమణ, రాళ్ళబండి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

ఎదులాపురం: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్ సయ్యద్ ముజఫర్ హైమద్ (40) అదృశ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్సై నవీన్ తెలిపారు. ఈ నెల 21న పట్టణంలోని శాంతినగర్‌లో గల తన మామయ్య మహ్మద్ అఫ్జల్ ఇంటికి వెళ్లాడు. నమాజ్‌కి వెళ్లొస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో అతని కోసం గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో మహ్మద్ అఫ్జల్ శనివారం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి కేసులో శనివారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు టుటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షంశేర్, షబాబ్ గంజాయిని ప్యాకెట్లుగా చేసి విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అరెస్టు చేశారు. వారి దగ్గరున్న 75 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

108లో ప్రసవం


బాబును చూపుతున్న 108 సిబ్బంది

సిరికొండ: మండలంలోని వాయిపేట్ గ్రామానికి చెందిన పత్తుబాయికి శుక్రవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే గ్రామానికి చేరుకుని సదరు మహిళను ఇచ్చోడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వాహనంలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను ఇచ్చోడ ఆస్పత్రికి తరలించినట్లు పైలెట్ గోపినాథ్, ఈఎంటీ సురేష్ తెలిపారు.

జాతీయ సదస్సుకు నిర్మల్ వైద్యులు


సదస్సులో పాల్గొన్న వైద్యులు చక్రధారి, రమేశ్

నిర్మల్ ఖిల్లా: కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో జరుగుతున్న చిన్నపిల్లల వైద్య నిపుణుల 61వ జాతీయ సదస్సుకు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు హాజరయ్యారు. ఈనెల 25 నుంచి 28 వరకు కొనసాగుతున్న సదస్సులో నిర్మల్ జిల్లా నుంచి సీనియర్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అప్పాల చక్రధారి, డాక్టర్ రమేశ్ గడపాలే హాజరయ్యారు. ఈ సదస్సులో ప్రపంచ దేశాల నుంచి 7,500 మంది పిల్లల వైద్య నిపుణులు పాల్గొంటున్నారు. పిల్లలకు వచ్చే పలు రకాల వ్యాధుల గురించి దేశ, విదేశాల నుంచి వచ్చిన నిపుణులు, ఉపన్యాసకులు సెమినార్, కార్యశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చిన్న పిల్లల్లో పట్టి పీడిస్తున్న చెంప గడ్డలు(మంప్స్) గురించి ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈ వైరస్ వల్ల మెదడు, కిడ్నీలు, గుండె, పాంక్రియా తదితర అవయవాలపై ప్రభావం చూపడంతోపాటు కొన్నిసార్లు మరణాలు సంభవించే అవకాశం కూడా ఉంటుందన్నారు. ఇందులో చర్చకు వచ్చిన పలు అంశాలు రానున్న రోజుల్లో పిల్లల వైద్య సేవల్లో పలు పరిశోధనలకు దారితీస్తాయని పేర్కొన్నారు.

పోచమ్మ ఆలయం కోసం ఆందోళన


రోడ్డుపై వేసిన ముళ్ల కంచె

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ఇందిరమ్మ కాలనీలో పురాతన పోచమ్మ ఆలయం ఉండేది. రెండేళ్ల క్రితం కొందరు గుడిని తొలగించారని, దానిని పునరుద్ధరించాలని కాలనీవాసులు శనివారం ఆందోళన చేశారు. ఇద్దరు మహిళా భక్తులకు పూనకాలు వచ్చి ఆలయం నిర్మించాలని చెప్పడంతో కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. రహదారిపై రాళ్లు, ముళ్లకంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ భూమిని అమ్మవారికి కేటాయించాలని గతంలో సైతం ఆందోళనలు చేశామన్నారు. భూమి యజమాని ఈ స్థలాన్ని ఆలయానికే ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించామన్నారు. ఆలయం నిర్మించే వరకు తాము ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. దీంతో అక్కడికి చేరుకున్న పట్టణ ఎస్సై రాజేశ్వర్ గౌడ్ ఆందోళన విరమింపజేసి రోడ్డుపై వేసిన ముళ్ల కంచె, రాళ్లు తొలగింపజేశారు.

క్లుప్తంగా

వధూవరుల పరిచయ వేదిక

కుభీర్: వచ్చే నెల 11న వరంగల్‌లో జరిగే పద్మశాలి వివాహ పరిచయ వేదికను పద్మశాలీలు జయప్రదం చేయాలని, మధ్యాహ్నం 1 గంటకు వరంగల్‌లోని కెమెస్ట్రీ, డ్రగెస్ట్ భవనంలో నిర్వహించనున్నట్లు పద్మశాలి జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భూర ఉమా శంకర్ అన్నారు. ఈ కార్యక్రమానికి పద్మశాలీలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు


చెకుముకి పోటీల్లో విద్యార్థులు

భైంసారూరల్: మండలంలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. సైన్స్ సంబరాల్లో భాగంగా శనివారం 8,9,10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మండల స్థాయికి ఎంపికకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కదారి దశరథ్, సత్యనారాయణ, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోధ్యకు వెళ్లిన పాదయాత్రికుడికి సన్మానం

కుభీర్: కుభీర్‌కు చెందిన జాదవ్ మాధవ్ పాదయాత్రగా అయోధ్యకు వెళ్లి శనివారం కుభీర్‌కు రాగా గ్రామస్తులు ఆయనకు ఘనంగా సన్మానించారు. ఊరి బయట నుంచి విఠలేశ్వర మందిరం వరకూ డప్పుచప్పుళ్ల మధ్య తీసుకొచ్చారు. అనంతరం విఠలేశ్వర మందిరంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచు మీరవిజయ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బంక బాబు, మాజీ ఎంపీపీ బోయిడి విఠల్ ఉన్నారు.

చదువుల్లో రాణించాలి


స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంఈవో

కుంటాల: విద్యార్థులు చక్కగా చదువుకోవాలని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. శనివారం కుంటాల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ధర్మాజీ చందనే రూ.3,500 విలువ చేసే స్టడీ మెటీరియల్, జనరల్ నాలెడ్జ్ బుక్స్, సల్లా శ్రీనివాస్ రూ.3,600 విలువ గల ఆట వస్తువులను ప్రదానం చేశారు. వీటిని విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు తయారీ

కుంటాల: తడి, పొడి చెత్త వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నామని సర్పంచ్ కనీస్ ఫాతిమా పేర్కొన్నారు. రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. శనివారం ఓలా గ్రామంలో రైతు యూనుస్‌కు సేంద్రియ ఎరువు విక్రయించడం ద్వారా రూ.2,500 ఆదాయం వచ్చిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యోగేష్, కారోబారి కూస శంకర్ ఉన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి


మాట్లాడుతున్న జడ్జి దేవేంద్రబాబు

భైంసా: పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని భైంసా కోర్టు జడ్జి దేవేంద్రబాబు అన్నారు. శనివారం భైంసా కోర్టులో డివిజన్ పోలీసులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులను సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేసేలా చూడాలన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేసేవారికే గుర్తింపు


ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీపీ

కుంటాల: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా డీటీ నరేష్ గౌడ్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్లు కిషోర్ కుమార్ ఫైజాన్ అహ్మద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. వీరిని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించి మాట్లాడారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, ఎంపీటీసీలు సుధాకర్, కట్ట రవి, మధు, మోహన్, పీఆర్ ఏఈ రఘువంశీ ఉన్నారు.

విద్యార్థుల పొలం బాట


కుంటాల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం ఎల్లన్న


కడెం: వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు


కడెం: పర్యటనకు వెళ్లిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు వ్యవసాయ క్షేత్ర పర్యటనకు శనివారం మండలంలోని చిన్నబెల్లాల్ వెళ్లారు. వ్యవసాయ పనులను పరిశీలించి కూలీలతో కలిసి నాట్లు వేశారు. వ్యవసాయ పనుల్లో పాల్గొనడం గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. ఇందులో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ వృత్తి విద్య శిక్షకుడు రఘురెడ్డి, శివకుమార్ ఉన్నారు.

కుంటాల: నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పెంచికల్‌పాడ్ పాఠశాల విద్యార్థులు వ్యవసాయ పంట పొలాలకు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. పంట పొలాల్లో కలుపు తీయడం, ఎరువులు వేయడం, నీరు పెట్టడం తదితర విషయాలను హెచ్‌ఎం ఎల్లన్న వివరించారు. ఉపాధ్యాయులు ఉమారాణి, శ్రీనివాస్, ప్రియాంక న్నారు.

కూరగాయల ఊరు..

- ఎటుచూసినా కూరగాయ పంటలే..
- గ్రామంలో వ్యవసాయంపై మొగ్గు
- ఆదర్శంగా నగర్‌తండా...

లోకేశ్వరం: ఆ పల్లె ప్రధాన జీవనాధారం వ్యవసాయం.. కూరగాయల సాగు ఇక్కడి ప్రత్యేకత. సీజన్‌తో సంబంధం లేకుండా దాదాపు అందరు రైతులూ కూరగాయలే పండిస్తారు. ప్రతీ రోజు ఉదయం కూరగాయాలను జిల్లా కేంద్రంతో పాటు, మండలాలు, గ్రామాల్లోకి తీసుకెళ్లి విక్రయిస్తూ ఆదాయం పొందడంతో పాటు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు నగర్‌తండా రైతులు.

అందరూ కూరగాయల సాగే..

నగర్‌తండా గ్రామం లోకేశ్వరం మండలానికి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉంది. ఆ గ్రామంలో 80 కుటుంబాలు నివసిస్తుండగా 70 కుంటుబాలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నాయి. అందరూ కూరగాయలే సాగుచేస్తారు. అన్ని సీజన్లలో కూరగాయలు పండిస్తూ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు.

అటవీ జంతువులతో ఇబ్బంది...

పంటలకు అటవీ జంతులైన కోతులు, జింకలు, అడవి పందులతో ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల సాగులో కొందరు రైతులు ఆధునిక పద్ధతులు అవలంబిస్తున్నారు. పందిరి సేద్యం, మల్చింగ్ వంటి విధానాలు పాటిస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లను కూడా వినియోగిస్తున్నారు. అయితే వారిని అటవీజంతువులు ఇబ్బంది పెడుతున్నాయి.

అన్ని రకాల కూరగాయల సాగు ...


టమాట కూరగాయాల సాగు

నగర్‌తండాలో రైతులు అన్ని రకాల కూరగాయలు సాగు చేస్తారు. తీగజాతికి చెందిన బీర, కాకర, చిక్కుడు, సోరకాయ తదితర కూరగాయలు పండిస్తున్నారు. టమాట, వంకాయ, ద్యాబేజీ, ఆరుగోబి, గోరుచిక్కుడు, మిరపకాయ, కొత్తిమీర, మెంతి, పాలకూర, ఉల్లి కూడా సాగు చేస్తారు. ఇలా ఒక్కో రైతు రోజుకు రూ.500 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తాడు.

మార్కెట్‌లో ఇక్కట్లు...

కూరగాయలు అమ్మడానికి వచ్చిన సమయంలో రైతులు నానాఇబ్బందులు పడుతున్నారు. అబ్దుల్లాపూర్, నర్సాపూర్(జి) సంతలో సరైన మార్కెట్ సౌకర్యాలు లేకపోవడంతో రోడ్లపైనే విక్రయిచాల్సి వస్తోంది. సౌకర్యాలు లేనప్పటికీ తైజార్ మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అడిగినన్నీ డబ్బులు ఇవ్వకుంటే తమ వద్ద నుంచి కూరగాయల ముల్లెలను లాక్కుని వెళుతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌కు తీసుకెళ్తాం



మాకున్న అరఎకరం భూమిలో రకరకాల కూరగాయలు సాగు చేస్తాం. ఉదయం వివిధ మార్కెట్లకు తీసుకెళ్లి అమ్ముతున్నం. అవసమున్నవారు తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తారు.

- కిషాన్, నగర్‌తండా

దళారులకు అమ్ముకోం



మేము పండించిన కూరగాయలను దళారులకు అమ్ముకోము. సాయంత్రం కూరగాయలు తెంపి ఉదయం మార్కెట్‌కు తరలించి విక్రయిస్తాం. మార్కెట్ డిమాండ్‌ను బట్టి రేటు వస్తుంది. లాభాలు రావడంతో కూరగాయలే పండిస్తున్నాం.

- పుష్పబాయి, నగర్‌తండా

గ్రామాల్లో అమ్ముతాం



రైతులందరూ కూరగాయలే సాగు చేస్తుండడంతో మా ఊరుని కూరగాయల ఊరంటారు. ఉదయం ఊళ్లల్లో తిరిగి కూరగాయలను విక్రయిస్తాం. మళ్లీ తోట పనులకు వెళ్లి కూరగాయలను మరుసటి రోజుకు సిద్ధం చేస్తాం.

- ప్రకాశ్, నగర్‌తండా

కార్యకర్తలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటమికి గల కారణాలను విశ్లేషించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్యపడవద్దని తాను అన్ని విధాల కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. గెలుపు, ఓటములు సహజమేనని ఓటమికి కుంగిపోకుండా ప్రజా సమస్యలపై ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కొమ్రేవార్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ చౌహాన్ శంకర్, మండల పార్టీ అధ్యక్షుడు అనీల్, మైనార్టీ నాయకులు రహూఫ్ ఉన్నారు.

తడిపొడి చెత్తను వేరుచేయాలి

సారంగపూర్: ఇళ్లలో, ఇతర దుకాణాల్లో వ్యర్థాలను తడిపొడి చెత్తగా వేరు చేయాలని ఒకేదాంట్లో తడి పొడి చెత్తను వేయవద్దని గ్రీన్‌వర్క్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శరత్ చంద్ర అన్నారు. మండల కేంద్రమైన సారంగాపూర్, జామ్ గ్రామాల్లో శనివారం ఆయన ప్రజలకు తడి, పొడి చెత్తలతో పాటు వ్యర్థాలను ఆరు కేటగిరీలుగా విభజించే విధానాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా చెత్తను తడి, పొడి, హానికర వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, మెడికల్ వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అని ఆరు కేటగిరీలుగా ఉంటాయన్నారు. వీటన్నింటినీ కలిపి ఒకేదాంట్లో కలిపివేయడంతో చెత్తను రీసైకిల్ చేయడం సాధ్యం కాదని తెలిపారు. ప్లాస్టిక్‌ను తగ్గించడానికి రీసైకిల్ చేయడమే ఉత్తమమైన పద్ధతని, అలాగే తడిచెత్త నుంచి ఎరువులను తయారీ చేసి మళ్లీ పంటలకు ఉపయోగించుకునేలా చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇలా చేయడంతో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని, పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తలను వేరుగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, నాయకులు నర్సారెడ్డి, ప్రజలు ఉన్నారు.

అక్రమ రవాణా నియంత్రణ సామాజిక బాధ్యత


మాట్లాడుతున్న ప్రముఖ న్యాయవాది నరేందర్

నిర్మల్‌టౌన్: మానవ అక్రమ రవాణా నియంత్రణ సామాజిక బాధ్యత అని ప్రముఖ న్యాయవాది నరేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సూర్ ఎన్జీవో కార్యాలయంలో న్యాయవాద సమావేశనాయన మాట్లాడారు. ఐటిపిఏ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూర్ ఎన్జీవో ప్రాజెక్ట్ మేనేజర్ మల్లికార్జున్, మధుకర్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎంపీపీ

ముధోల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మిషన్ భగీరథ ఏఈ సుమన్ మాట్లాడుతుండగా పలువురు సభ్యులు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదన్నారు. ముధోల్ సర్పంచ్ రాజేందర్, ఎంపీటీసీ దేవోజీ భూమన్న అభ్యంతరం వ్యక్తం చేస్తూ ముధోల్‌లో ఇప్పటి వరకు 25శాతం మాత్రమే మిషన్ భగీరథ నీరు వస్తుందన్నారు. అనంతరం పలువురు అధికారులు ప్రగతి నివేదికలను వినిపించారు. త్వరలో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆయా గ్రామాల సర్పంచ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆయేషాఅఫ్రోజ్‌ఖాన్, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఆర్‌వో అతికోద్దిన్, తదితరులున్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

లోకేశ్వరం: మండలంలోని నగర్, రాయపూర్‌కాండ్లీ, పిప్రి గ్రామాల్లోని యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయాధికారి గణేష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు తగిన మోతాదులో మందులను పిచికారీ చేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో మొక్కజొన్న పంటకు కాండం తొలుచు పురుగు (విల్ట్) సోకయాన్నారు. కాండం తొలుచు పురుగుకు అజోక్సిస్ట్రోబిన్, డైఫెనోకోనజోల్‌ల మందులను తగిన మోతాదులో వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకు ఈ మందును పిచికారీ చేయలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అశోక్, భూమన్న, భోజన్న, ఏఈవోలు కుంట మౌనిక, మౌనిక ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్ష


మాట్లాడుతున్న గిరిజన సంఘం కార్యదర్శి శంభు

నిర్మల్‌టౌన్: ఈ నెల 28న నిర్మల్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం కార్యదర్శి శంభు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 10వ తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రముఖ విద్యావేత్తలు రూపొందించిన 100మార్కుల బిట్స్‌లో పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించడానికి ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సత్యనారాయణ, శేఖర్, సంతోష్ ఉన్నారు.

వాహనాల బహిరంగ వేలం

నిర్మల్‌టౌన్: వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో జిల్లా ఆబ్కారిశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సంపత్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఇందులో 19 ద్విచక్ర వాహనాలు, 5 మోపెడ్లు, రెండు ఆటోలు మొత్తం 26 వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

పెంబి: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అంతకుమందు మండలంలోని శెట్‌పల్లి, కొలాంగూడలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభోత్సవానికి వెళ్లి శిలాఫలకం ఏర్పాటు చేయకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి ప్రారంభోత్సవం చేయకుండానే వెళ్లిపోయారు. తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో సుధాకర్, ఎంపీవో రత్నాకర్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి, సర్పంచ్ రాధ, సీడీపీవో సరిత ఉన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నంది రామయ్య

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ఖానాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో గిరిజనులు, ఇతర పేదలు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు సీపీఐఎంఎల్(ప్రజా పంథా) ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని బీర్నంది గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరై వినతి పత్రాన్ని అందజేశారు. ఇది వరకు సాగుచేసుకుంటున్న పోడు భూముల్లో బావులు తవ్వుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ-బూర్గుపల్లి(జి) గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డు భారీ వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ నెల 27న శనివారం సాక్షిలో 'ప్రమాదం జరిగేదాకా చూస్తారా?' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పీఆర్ ఏఈ సూర్య తేజగౌడ్ సిబ్బందిచే రోడ్డుకు మరమ్మతులు చేయించారు. దగ్గరుండి పనులను పర్యవేక్షించారు.

నూతన కమిటీ ఏర్పాటు

భైంసా: భైంసా పట్టణంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా సట్లవార్ సాయినాథ్, ఉపాధ్యక్షుడిగా మామిడోళ్ల స్వామి, కార్యదర్శిగా దొమకొండ రాజు, క్యాషియర్‌గా శ్రీనివాస్, సలహాసభ్యుడిగా డాక్టర్ ముత్యంరెడ్డిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకున్న కమిటీని పలువురు సన్మానించారు. నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో సేవలు కొనసాగిస్తామని నూతన కార్యవర్గ సభ్యులు అన్నారు.

లెనినిజంపై సెమినార్‌ను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రెడ్ లెనిన్ శతజయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఈ నెల 28న వర్తమాన పరిస్థితితులు లెనినిజం ప్రాధాన్యతపై నిర్వహించే సెమినార్‌ను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నూతన్ కుమార్ కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు బొమ్మెన సురేశ్, డాకూరి తిరుపతి, తోడసం శంభు, నాగెల్లి నర్సయ్య, చుంచుల నారాయణ ఉన్నారు.

సంక్షిప్తం..

వరి పంట పరిశీలన



లోకేశ్వరం: జిల్లాలో యాసంగిలో రైతులు వరి పంటను సాగు చేశారు. వరి నాటిన 15రోజుల్లో జిల్లాల్లోని వివిధ గ్రామాల్లో మొగిపురుగు సోకింది. దీంతో శనివారం సాక్షిలో 'మళ్లీ మొగి' అనే శీర్షికన కథనం ప్రచురతమైంది. స్పందించిన మండల వ్యవసాయాధికారి గణేష్ ధర్మోర, అబ్దుల్లాపూర్ లో పంటను పరిశీలించి సూచనలు చేశారు.

పరామర్శ

భైంసా: బాసర మండలం లాబ్ది గ్రామానికి చెందిన మారుతిపటేల్ ఇటీవలే మృతిచెందాడు. శనివారం ముధోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావుపటేల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. భైంసా మాజీ ఎంపీపీ రాంచంద్రారెడ్డి, బాసర మాజీ సర్పంచు రమేశ్, నాయకులు శంకర్‌చంద్రే ఉన్నారు.

ఆపదలో 100కు డయల్ చేయండి

నిర్మల్‌టౌన్: ఆపదలో ఆందోళన చెందకుండా 100 డయల్ చేయాలని షీటీం ఎస్సై సుమంజలి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జీఆర్పీ షాపింగ్‌మాల్, ఆర్టీసీ బస్టాండ్‌లోని ప్రయాణికులకు షీ టీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. షీ టీం ఎమర్జెన్సీ నెంబర్ 87126 59550కు ఫోన్ చేయాలని సూచించారు. ఇందులో షీ టీం పోలీసులు ఉన్నారు.

తిమ్మాపూర్‌ను సందర్శించిన ఎంపీవో

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామాన్ని శనివారం ఎంపీవో మోజంహుస్సేన్ పరిశీలించారు. గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతి వనం, క్రీడామైదానం, నర్సరీ, గ్రామపంచాయతీ రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి ప్రియాంక ఉన్నారు.

వైభవంగా స్వామివారి పల్లకి సేవ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలు పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్ ఉన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదువుకోవాలి

లక్ష్మణచాంద: విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల కేంద్రం సర్పంచ్ ముత్యం రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తగరతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎస్‌వో నవిత పాల్గొన్నారు.

గురుకులంలో వైద్య పరీక్షలు

ముధోల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం ఉదయం ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురి కాగా ప్రిన్సిపాల్ అమృతయ్య డాక్టర్ ఆకాష్‌తో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బదిలీ

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌నాయక్ బదిలీ అయ్యారు. ఈమేరకు మల్టీ జోన్-2 ఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రవీందర్‌నాయక్‌ను ఎల్లారెడ్డి సీఐగా నియమించారు.